# ఏక్ దం న్యూస్

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 09 మార్చి 2025 | తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 05 | పేజీలు 04



విలేకరులు కావలెను

తక్కువ సమయంలోనే ప్రజల ఆదరణ పొందుతున్న

తెలుగు దినపత్రికకు

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్,

నియోజకవర్గ ఇన్చార్జ్,

మండల రిపోర్టర్స్ కావలెను.

ఏక్ దం న్యూస్

8790055545


# ఎమ్మెల్సీ ఓటమిపై

## కాంగ్రెస్ పెద్దలు ఆరా

- ❖ కాంగ్రెస్ ఓటమి పై నగరంలో పెద్ద చర్చ
- ❖ క్యాడర్ ను ఉత్తేజపరుస్తూ సమావేశాలు
- ❖ ఆలస్యంగా ఎన్నికల ఇంచార్జీగా రుద్ర సంతోష్ నియామకం
- ❖ కోఆర్డినేటర్‌ను ముందే నియమిస్తే ఫలితాలు మారేవని చర్చలు







**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలానే సంకల్పంతో నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 42 అసెంబ్లీలలో హోరాహోరిగా జరిగిన ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కరీంనగర్ జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో పాటు తెరవెనుక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోఆర్డినేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి రుద్ర సంతోష్ కుమార్ నిబద్ధతతో పనిచేసారు. ప్రస్తుతం ఇదే కార్యకర్తల్లో, నాయకుల్లో చర్చనీయాంశమైంది. అభ్యర్థి ప్రకటన నుండి మొదటి రెండు వారాల్లో అభ్యర్థి చేసిన అంతంత ప్రచారం, నెగటివ్ పబ్లిసిటీ, కార్యకర్తలకు సరైన దిశానిర్దేశం లేక, వివిధ నియోజకవర్గాల్లో సమస్యలుగా మారడంతో ఎలక్షన్‌కి వారం ముందు మంత్రి శ్రీధర్ బాబు రంగంలోకి దిగి రోజుకు 4–5 బృందాలను కలుస్తూ, డాక్టర్స్, అడ్వొకేట్లు, మైనారిటీస్, బలహీన వర్గాల మీటింగ్స్, కాలేజీ యాజమాన్యాలను రోజువారి మీటింగ్స్ చేస్తూ తీవ్ర కృషిచేసారు. ఒకపక్క ఇక్కడే సమస్యలను గుర్తించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, క్యాడర్ కోఆర్డినేషన్‌లో నిష్ణాతుడైన ఏఐసిసి నేషనల్ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ కుమార్‌ని పిలిపించి ఈఎన్నికల భాధ్యతలను చూడాలని ఎన్నికల ఇంఛార్జిగా ఆలస్యంగా నియమించారు. రుద్ర సంతోష్ కుమార్ కూడా కరీంనగర్ జిల్లా వాసి కావడంతో, గతంలో తెలంగాణ అసెంబ్లీ 2023 పార్లమెంట్ 2024 ఎన్నికల్లో వార్ రూమ్ ఇంచార్జిగా, తెలంగాణాలో జరిగిన కులగణనకు కోఆర్డినేటర్‌గా విశిష్ట పనితీరును కనబరిచారు. అధిష్టానం వద్ద మంచి పేరు, తెలంగాణ కాంగ్రెస్‌లో అందరి నాయకులతో టిపిసిసి కోఆర్డినేటర్స్ ముఖ్యంగా బ్లాక్, మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు, కులసంఘాలతో ఉన్న పరిచయాలను ఎప్పటికప్పుడు కోఆర్డినేట్ చేస్తూ బూత్, గ్రామస్థాయి కార్యకర్తలతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీకి ఈ గెలుపు ఎందుకు ముఖ్యమో అర్థం అయ్యేలా చెప్పడానికి ప్రయత్నం చేసారు. ఇందుకోసం ఒక కాలింగ్ సెంటర్ ఏర్పాటుచేసి సుమారుగా 60 మందికి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్స్‌కి స్వయంగా ట్రైనింగ్ ఇచ్చి, అధునాతన సాఫ్ట్వేర్ ద్వారా సుమారుగా 8000 పైచిలుకగా ఉన్న బూత్, గ్రామస్థాయి కార్యకర్తల నుండి సమాచారం తెప్పించుకొని, జూమ్ మీటింగ్‌లతో ఎప్పటికప్పుడు తన వంతుగా ఉత్సాహపరిచేలా పనిచేసారు. ఆరు రోజుల్లో కార్యకర్తల్లోనే పట్టభద్రుల్లో ఉన్న నెగిటీవ్ టాక్‌ను పోగొట్టారు. ఎలక్షన్ కమీషన్‌కి లెటర్‌రాసి, నాలుగు నుండి ఐదు వేల ఓట్లను వాలిడ్ ఓట్లుగా గుర్తించేలా చేయడంలో సఫలమయ్యారనే చెప్పవచ్చు. అయితే, రుద్ర సంతోష్‌ను కాస్త ముందు నియమించి ఉంటే కాంగ్రెస్ గెలుపు పక్కా అయియుండేదని కార్యకర్తల్లో, నాయకుల్లో చర్చలు జరుగుతున్నాయి.




# ఫ్లెక్సీల తొలగింపులపై

## బీజేపీ శ్రేణుల ఆందోళన

- ◆ ఎవరి మెప్పు కోసం ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు?
- ◆ పోలీసుల తీరుపై బీజేపీ నేతల మండిపాటు
- ◆ ఫ్లెక్సీలను రాత్రివేళ బలవంతంగా తొలగించిన పోలీసులు
- ◆ కరీంనగర్ లో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ లేదా...? అంటూ ఆగ్రహం

**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**

బీజేపీ టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఘన విజయంపై శుభాకాంక్షలు తెలియజేస్తూ కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరీంనగర్ తాజా మాజీ కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ ఏర్పాటు చేసిన హెూర్డింగ్ లను శనివారం రాత్రి పోలీసులు బలవంతంగా తొలగించారు. పోలీసులు ఫ్లెక్సీలను తొలగిస్తున్న విషయం తెలుసుకున్న బీజేపీ శ్రేణులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే తాజా మాజీ కార్పొరేటర్ వంగళ పవన్ శ్రీదేవి ఏర్పాటు చేసిన హెూర్డింగ్స్ వల్ల కమ్యూనల్ గొడవలు వస్తాయని పోలీసులు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ లో పోలీసులు కొత్త రూల్స్ అమలు చేస్తున్నారని, పాకిస్తాన్ పేరు పెడితే కమ్యూనల్ అల్లర్లు, గొడవలు ఎందుకు వస్తాయో పోలీసులు సమాధానం చెప్పాలని బీజేపీ శ్రేణులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తాజా మాజీ కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో "విరాట్ కోహ్లీ = బండి సంజయ్" అని, "సంజయన్న = విరాట్ కోహ్లీ ఆఫ్ బీజేపీ" అని, "బెస్ట్ పర్ఫామెర్స్ కోహ్లీ వర్సెస్ పాకిస్తాన్", "సంజయ్ వర్సెస్ కాంగ్రెస్" కొటేషన్లతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే తప్పేముందని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. కరీంనగర్ లో ఈ విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ కూడా లేదా...? కరీంనగర్ భారతదేశంలో ఉందా...? లేకపోతే పాకిస్తాన్లో ఉందా..? అని కరీంనగర్ పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఏ మతాన్ని కించపరచలేదని, కేవలం పాకిస్తాన్ పేరు పెడితే కమ్యూనల్ గొడవలు ఎందుకు వస్తాయో అర్థం కావడం లేదన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ కేంద్రంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు..

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**


అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ లోని డాటా ప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పి ఎం కె కె స్కిల్ డెవలప్మెంట్ ) కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన బీజేపీ సౌత్ జోన్ అధ్యక్షురాలు బండారి గాయత్రీ దేవి మాట్లాడుతూ పురుషులతో సమానంగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మహిళల హక్కుల కోసం, చట్టసభల్లో మహిళలకు అవకాశాలు కల్పించడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పీఎం విశ్వకర్మ యోజన ట్రైనింగు పూర్తిచేసిన అభ్యర్థులకు, ఇతర కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసి చేసిన వారికి బండారి గాయత్రి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో డాటా ప్రో కరీంనగర్ సెంటర్ నిర్వాహకులు నిరంజన్, హౌసింగ్ బోర్డ్ కాలనీ బిజెపి నాయకులు తోట సాగర్ తదితరులు పాల్గొన్నారు.




**మహిళా ఉద్యోగులకు సన్మానం..**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ సౌత్ జోన్ అధ్యక్షురాలు బండారి గాయత్రి దేవి ఆధ్వర్యంలో కరీంనగర్ నగర పాలక సంస్థ మహిళా ఉద్యోగులను సత్కరించి, వారితో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, బీజేపీ మహిళా నాయకురాలు కాసర్ల లక్ష్మి, కన్నాంబ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ దినోత్సవ సందర్భంగా రక్తదానం చేసి విజయ




**- మహిళలకు ఆదర్శం గా నిలిచిన వీర మహిళలు**

**- మెగా స్టార్ చిరంజీవి స్ఫూర్తి తో రక్త దానం**

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**

మహిళా దినోత్సవ సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విజయ రక్తదానం చేయడం జరిగింది ఈ సందర్భంగా సామాజిక సేవకులు గాలిపెల్లి కుమార్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా విజయ అనే మహిళా ముందుకు వచ్చి రక్తదానం చేయడం మహిళా మృతుల అందరికీ ఆదర్శంగా నిలిచిందని వారిని కొనియాడారు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయవచ్చని ఈ సందర్భంగా వారు తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న నేటి మహిళలు



**- జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనుప్ కుమార్**

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**

మహిళలు ప్రపంచ దేశాలతో అన్ని రంగాలలో పోటీ పడుతున్నారని జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనుప్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బ్యాంక్ కాలనీలోని జీనియస్ చెస్ అకాడమీ మహిళలకు చదరంగం పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు మాధవి, స్వప్న, సౌమ్య, స్వాతి, శ్వేత, సుజిత, కవిత అకాడమీ బాధ్యులు సృజన్ కుమార్, తాటి పెల్లి సతీష్ బాబు, కోచ్ లు అరుణ్, ప్రభుచంద్ర, శ్రీనిజ , స్వాతి, సాహితి. తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి...



**ఏక్ దం న్యూస్, చిగురుమామిడి :**

మండల కేంద్రంలోని గాగిరెడ్డిపల్లిలో పేకాట స్థావరాలపై చిగురుమామిడి పోలీసు వారు సమాచారం మేరకు పేకాట స్థావరంపై మెరుపు దాడి చేశారు ఈ ఘటనలో గాగిరెడ్డిపల్లికి చెందిన నలుగురు మరియు సుందరగిరి గ్రామానికి చెందిన నలుగురు పట్టుబడ్డారు వారి నుండి నగదు 11700 మరియు ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు చిగురుమామిడి ఎస్ఐ బండి రాజేష్ మాట్లాడుతూ ఇలాంటి ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని ఎవరినైనా వదిలిపెట్టేది లేదని ఇలాంటివి ఎక్కడ జరిగిన ఉపేక్షించేది లేదని ఇంకా ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినచో మాకు సమాచారం ఇవ్వాలని కోరారు వీరిని తక్షణం కోర్టులో హాజరు పరిచి తగిన శిక్ష విధింప చేస్తాం అని ఆయన అన్నారు.

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు



**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**

మహిళలు అభివృద్ధికి పునాది అని మరియు కుటుంబ సంక్షేమానికి నిర్వచనమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కుటుంబ పాలనతో పాటు పలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమాజంలో ఉన్నత స్థితిలో కొనసాగుతున్నారని తెలుపుతూ కుటుంబ వ్యవహారాలకు ఎటువంటి విఘాతం కల్గించకుండా సుఖవంతమైన జీవితాన్ని కల్పించేటువంటి శక్తి మహిళలు కలిగి ఉంటారని కొనియాడుతూ ప్రతి మగవారి విజయంలో స్త్రీ పాత్ర విశిష్టమైనదని చెప్పారు. మహిళలు లేని లోకాన్ని ఊహించలేమని మరియు వారి లోటును ఎవరు కూడా పూడ్చలేరని తెలుపుతూ లోకానికి భీజం వేసేటువంటి వారు మహిళలు అని తెలియజేశారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు వారి వారి కార్యకలాపాలలో నిమగ్నమైనప్పటికి మహిళలు వారి ప్రేమ-ఆప్యాయతలను ఎటువంటి భేద-భావాలు లేకుండా చూపెడుతారని దీని ద్వారా వారియొక్క వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు.

మహిళలు కేవలం వంటగదికే పరిమితం కాకుండా నేడు సమాజంలో ఉన్నత లక్ష్యాలను చేదిస్తూ అత్యుత్తమంగా సమాజంలో విజయాలకు పర్యాయపదంగా మారుతున్నారని చెప్పారు. మహిళలు అన్ని రంగాలలో ధైర్యంతో మరియు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి దేశ అభివృద్ధికి పాటు పడాలని సూచిస్తూ భావితరాన్ని సరియైన మార్గంలో పయనించేందుకు చేయూతనందించాలని సూచించారు.

వేడుకలలో భాగంగా పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికై అహర్నిషలు కృషి చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మరియు వారికి బాల్యం గుర్తుకువచ్చేలా పలు వినోదభరితమైన క్రీడా పోటీలను నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులు ప్రదర్శించినటువంటి "మహిళ సమాజానికి దేవత", "మహిళ మేలుకో - సమాజాన్ని ఏలుకో " మహి దినోత్సవం..... మహిళదినోత్సవం, మహిళ.... నీవే సమాజానికి ప్రతీక, స్త్రీ శక్తి.... అనంతమైన శక్తి నృత్యాలు చాలా ఆలోచింపజేశాయి , ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకతీయ పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ లోని కట్టారాంపూర్ లో గల కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో ఈరోజు ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. ఇట్టి కార్యక్రమమును పాఠశాల కరస్పాండెంట్ సతీమణి గున్నాల అర్చన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆ తర్వాత పాఠశాల మహిళా అధ్యాపక బృందము అందరికీ ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చివరగా ముఖ్య అతిథి గున్నాల అర్చన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి అని తెలుపుతూ, ఒకప్పుడు మహిళ ఇంట్లో పనులకు మాత్రమే చక్కబెట్టేది, బయట పనులకు వీరికి అంత సామర్థ్యం లేదు అని అవహేళన చేసేవారు కానీ ప్రస్తుతం ప్రతి పనిలో మహిళ లేనిది ఏ పని సాధ్యపడదు అనే స్థాయికి మహిళ ఎదిగింది అని నిరూపించుకున్నాము. అలాగే ఇప్పుడు పాఠశాలల్లో మహిళా అధ్యాపక బృందం ఎక్కువ ఉంటున్నారని, ఇది మహిళల విజయం అని తెలిపారు. ఇట్టి కార్యక్రమములో పాఠశాల మహిళా అధ్యాపక బృందం, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.



## బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైనా

# నైతికంగా కాంగ్రెస్‌దే విజయం

- ఓటర్లకు అవగాహన కల్పించి ఉంటే కాంగ్రెస్ 5 వేల మెజారిటీతో గెలిచేది
- సునీల్ రావు సీఎం రేవంత్ రెడ్డి ని విమర్శించే స్థాయా నీది
- పద్ధతి మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్




**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైనా నైతికంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించాడని ఓటర్లకు అవగాహన కల్పించి ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 5 వేల పైన మెజారిటీ తో గెలిచే వాడని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత ఓట్ల గురించి చిన్న చిన్న తప్పుల వల్ల ఓటు చెల్లకుండా పోతుందని తెలియక పోవడం వల్ల 28 వేల ఓట్లు వృధా అయ్యాయని అందులో సగానికి పైగా కాంగ్రెస్ అభ్యర్థి కి చెందినవే ఉన్నాయని నరేందర్ రెడ్డి అన్నారు. మెజారిటీ ఓటర్ల తీర్పు కాంగ్రెస్ అభ్యర్థి వైపు ఉన్నా సాంకేతికంగా ఓటమి పాలు కావడం జరిగిందని దీనికి బీజేపీ నాయకులు విర్ర వీగడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఓటర్లు ఈవీఎం లకు అలవాటు పడ్డారని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పేరుకు ఎదురుగా కొంతమంది 01 అని ఓటర్ లిస్టులో 2 వ స్థానంలో ఉండడం వల్ల 02 అని రైట్ గుర్తు పెట్టి ఇలా దాదాపు 15 వేలకు పైచిలుకు ఓట్లు చెల్లని ఓట్లు వేశారని వీరందరూ కూడా కాంగ్రెస్ పార్టీ కి మద్దతు గానే వేశారని నరేందర్ రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో సమన్వయం గురించి సునీల్ రావు మాట్లాడడమేంటని కొత్తగా బీజేపీలో చేరిన సునీల్ రావు మొదలు బీజేపీ లో ఉన్న అసమ్మతి వాదుల గురించి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. సిఎం రేవంత్ రెడ్డి గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే స్థాయి సునీల్ రావుది కాదని రొటీన్ పర్యటనలో భాగంగా ప్రజలకు కులగణన గురించి, ఎస్సి వర్గీకరణ గురించి పలు అభివృద్ధి కార్యక్రమాల పై ప్రజలకు వివరించడానికి ముఖ్యమంత్రి పర్యటన చేశారని అదే సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నందున వాటి గురించి మాట్లాడారు అంతేగాని ప్రత్యేకించి ఎమ్మెల్సీ ఎన్నిక గురించి ముఖ్యమంత్రి పర్యటన చేయలేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ సింగ్ బీఆర్ఎస్ కండువా కప్పుకొని నామినేషన్ దాఖలు చేశాడని ఆయనకు బీఆర్ఎస్ మద్దతు ఇవ్వకుండా చీకటి ఒప్పందం ప్రకారం బీజేపీ కి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అర్ష మల్లేశం, నగేష్ ముదిరాజ్ జీడి రమేష్, దండి రవీందర్, దన్న సింగ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, కుర్ర పోచయ్య,చాంద్ పాషా,మహమ్మద్ భారీ, బషీర్, వాడి వెంకట్ రెడ్డి,ఆంజనేయులు, సాయిరాం, గలిపెల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సునీల్ రావును చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుంది

- బండిని ప్రసన్నం చేసుకోవడానికే మంత్రి పొన్నంపై విమర్శలు
- పులి ఆంజనేయులు గౌడ్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్




**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**
రంగులు మార్చే ఊసరవెల్లి కంటే అద్వానంగా పార్టీలు మారిన మాజీ మేయర్ సునీల్ రావుకి మంత్రి పొన్నం ప్రభాకర్ నీ కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి లేదని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ మండిపడ్డారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశంలో మాట్లాడుతూ మాజీ మేయర్ సునీల్ రావు బండి సంజయ్ భజన చేస్తూ ప్రసన్నం చేసుకోవడానికి మంత్రి పొన్నం మీద కాంగ్రెస్ పార్టీ మీద విమర్శలు చేస్తున్నాడే తప్ప అంతకుమించి ఏమీ లేదని ఏద్దేవా చేశారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 19వేల పై చీలుకు ఓట్లు చెడిపోవడం వలన ఈరోజు బీజేపీ అభ్యర్థి గెలిచాడే తప్ప అంతకుమించి ఏమీ లేదని ఎద్దేవా చేశారు.. గత అసెంబ్లీ ఎలక్షన్స్ లో 119 నియోజకవర్గాలకు గాను కేవలం ఎనిమిది చోట్ల మాత్రమే బీజేపీ అభ్యర్థులు గెలిచారు అది మర్చిపోయిన మాజీ మేయర్ సునీల్ రావు అని అన్నారు, మేయర్ గా పనిచేసిన కాలంలో కరీంనగర్ స్మార్ట్ సిటీలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసుల నుండి బయటపడడానికి బండి సంజయ్ కాళ్లు పట్టుకొని బీజేపీలోకి పోయిన నువ్వు ఈరోజు కాంగ్రెస్ పార్టీ మీద విమర్శనాస్త్రాలు చేస్తున్నాడు.. సొంత బీజేపీ పార్టీలో ఉన్న కార్పొరేటర్లు మేయర్ సునీల్ రావును వ్యతిరేకిస్తున్న మాట నిజం కాదా అని సూటిగా చెప్పాలి.. కరీంనగర్ అభివృద్ధి ప్రదాత కేవలం పొన్నం ప్రభాకర్ నీ 2009 నుంచి 2014 వరకు పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్నప్పుడే వరంగల్ నుండి జగిత్యాల వరకు ఫోర్ లైన్ల రహదారి నిర్మాణం చేపట్టిన మాట నిజం కాదా? బండి సంజయ్ రెండుసార్లు ఎంపీగా కేంద్రమంత్రిగా ఏం చేశాడు ప్రజలకు తెలియజేయాలని పులి ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ లింగంపల్లి బాబు, మాజీ కార్పొరేటర్ టేల భూమన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, కొలగాని అనిల్, బండి పెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవం

- ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందడుగు
- పచ్చునూరు మహిళా సభలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**ఏక్ దం న్యూస్, మానకొండూర్:**
ఆధునిక మహిళలు పురుషులపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్నారని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మానకొండూర్ మండలం పచ్చునూరులో ఆగ్రామ మహిళలతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ మహిళలు స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్నారన్నారు. అన్ని అంశాల్లోనూ మహిళలు సమానత్వం సాధించాలన్నారు. మహిళలు అడుగు పెట్టలేని రంగం అంటూ ఏదీలేదని, అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగానే కాకుండా సమర్ధవంతంగా చేస్తూ తమశక్తిని చాటుతున్నారని, వర్తమాన సమాజంలో మహిళలు ఎన్నో అవకాశాలను అంది పుచ్చుకుంటున్నారని, ఆర్థికంగా శక్తివంతులతూ స్వాలంబన సాధిస్తున్నారన్నారు. మహిళాభ్యుదయానికి రాష్ట్రప్రభుత్వం పాటుపడుతోందని, ప్రభుత్వ పథకాల ద్వారా మహిళలు లబ్ధిపొందాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం నెరవేరుస్తున్నదని, అభివృద్ధి పనులను వేగవంతం చేసిందన్నారు. జన్మనిచ్చిన ఊరు పచ్చునూరు గ్రామప్రజల రుణం తీర్చుకుంటానని, సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని, ఎమ్మెల్యేగా గెలవడంలోనూ కీలకపాత్ర పోషించిన ఊరి ప్రజలకు మరింత సేవ చేస్తానని, అందులో భాగంగానే తాజాగా కోటి 38 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిరంతరం తపిస్తుంటారని, పని చేసే ఎమ్మెల్యే ఉండటం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. సేవా గుణం సత్యనారాయణలోనే కాకుండా వారి సతీమణిలో కూడా ఉండటం సుగుణమని ఆయన పేర్కొన్నారు. సుడా పరిధి గతంలో కంటే మరింత విస్తరించిందని, దీంతో సుడా ద్వారా ఎక్కువ గ్రామాలకు సేవలందించే అవకాశం కలిగిందన్నారు. సుడా పరిధిలోకి వచ్చే మానకొండూర్ నియోజకవర్గ గ్రామాల్లో అభివృద్ధి పనులకు తోడ్పాటునందిస్తామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, తాజా పచ్చునూరు గ్రామంలో కూడా హైమాస్ లైట్ల ఏర్పాటు చేస్తామని, అలాగే ఇతర అభివృద్ధి పనులు కూడా చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు ముద్దసాని సులోచన శ్రీనివాస్ రెడ్డి, మండల తహశీల్దార్ రాజేశ్వరి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రొంటాల జమునారెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దూలం దేవేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్,తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, కనుకం అశోక్, సీత నాగరాజు, నెలవేణి కుమార్, కనకం రాకేష్, దాసారపు స్వామి. ఎన్ రామస్వామి, సీత కనుకయ్య, ఎస్ మల్లయ్య, కోంద్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.